సోమవారం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 21.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:26 (బుధ)
సహరి : 4:35 (గురు)



పెన్షన్.. టెన్షన్



పించనుదారులతో వైసీపీ రాజకీయ చెలగాటం

తిరిగి విపక్షాలపై కౌంటర్ ఎటాక్

- లక్షలాది మంది వృద్ధుల్లో గందరగోళం
- రోగులు, కదలలేని వృద్ధులకు ఇంటికే పింఛన్
- నేటి నుంచి ఆరో తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పంపిణీ
- ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు అందజేత



సామాజిక పెన్షన్లు వెంటనే అందించాలని భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద టీడీపీ నాయకుల ఆందోళన

వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు మొదలైన వారికి ప్రతీ నెల ఒకటో తేదీన పంపిణీ చేసే పింఛన్‌లలో రెండు రోజులుగా రాజకీయ రాద్ధాంతం కొనసాగుతోంది. ఓట్ల వేటలో ప్రతిపక్షాలను ఇరుకున పెట్టి, పేదల మనస్సుల్లో అనుమాన బీజాలు నాటేందుకు ప్రయత్నించింది. వలంటీర్లలో కొందరు పరోక్షంగా వైసీపీ పథకాలన్నీ ఇళ్లకు చేరుస్తుండగా.. టీడీపీ అడ్డుకోవడం వల్లే మీకు పింఛన్ ఇవ్వలేకపోతున్నామని నిరక్షరాస్యుల చెవిలో ఊదేందుకు ప్రయత్నించారు. తమ పార్టీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని టీడీపీ తిప్పికొట్టింది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, మహిళలందరికి ఇంటింటికి వెళ్ళి పింఛన్ అందించాల్సిందేనని గట్టిగానే కోరింది. అధికారులకు విజ్ఞాపనలు అందించింది.

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

వృద్ధులతోపాటు అర్హులకు అందాల్సిన పింఛన్ ఏప్రిల్ నెల ప్రారంభమైన రెండు రోజులకు అందలేదు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబాలకు అందాల్సిన పింఛన్‌దీ అదే పరిస్థితి. ఆ స్థానంలో జరిగిన జాప్యానికి మసిపూసి మారేడు కాయ చేసేందుకు రెండు రోజులుగా అధికార వైసీపీ విపరీత పోకడలకు దిగింది. పింఛన్‌దారుల మదిలో విషం పూసేందుకు ప్రయత్నించింది. దీన్ని సాకుగా చూపెట్టి ప్రతిపక్షాలను టార్గెట్ చేసింది. సచివాలయాల వద్ద మూడు నుంచి ఆరో తేదీ వరకు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు పింఛన్ల అందించేలా చర్యలు చేపట్టింది. టీడీపీ మాత్రం తక్షణం పింఛన్ దారులు అందరికి ఇంటింటికి వెళ్లి నగదు అందించేలా చూడాల్సిందేనని, ఈ విషయంలో లోపాలు దొర్లకూడదని నియోజకవర్గాల వారీగా అధికారులకు విజ్ఞాపనలు అందజేసింది.

వైసీపీ కావాలనే వక్రీకరణ..

వలంటీర్లు కొందరు అధికార వైసీపీ కార్యకర్తలుగా మారి రాజకీయ పన్నాగాల్లో భాగస్వాములు అవుతుండడంతో వీరిపై ఎన్నికల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పింఛన్ పంపిణీ బాధ్యతను వలంటీర్ల నుంచి తొలగించాల్సిందిగా ఆదేశించింది. ఈ ఆదేశాల క్రమంలోనే వలంటీర్ల నుంచి ఈ బాధ్యతలు తప్పించటమే కాకుండా వారు వాడుతున్న మొబైల్స్‌ను అధికారులు స్వాధీన పరుచుకున్నారు. వాస్తవానికి ఇదంతా జరగ్గా ఎన్నికల కమిషన్‌ను పక్కనపెట్టి ఈ తతంగం అంతా తెలుగుదేశమే చేస్తుందంటూ వైసీపీ ఇష్టానుసారం ప్రచారానికి దిగిందని టీడీపీ ఆరోపిస్తోంది. ఇప్పటికే జాబితాలో ఉన్న వారందరికి పింఛన్లు యథావిధిగా అందించలేక చతికిలపడిన వైసీపీ కావాలనే వక్రీకరించి దీన్ని తమపై నెడుతున్నారని టీడీపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రత్యేకించి పింఛన్‌దారుల్లో వున్న గందరగోళాన్ని తక్షణం నివారించాలని ఆ మేరకు సచివాలయ సిబ్బందిని రంగంలోకి దించాలని అభ్యర్థించారు. వాస్తవానికి పింఛన్ పంపిణీలో ఇంతకు ముందు ఉన్న గందరగోళ పరిస్థితినే మంగళవారం కొంత కొనసాగింది.

ఏలూరు జిల్లాలో పింఛన్‌దారులు 2,81,470 మంది ఉండగా వీరికి రూ.81 కోట్ల 17 లక్షలు ప్రతినెల ఇప్పటివరకు అందజేస్తూ వచ్చారు. నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలో 2,36,722 మంది పింఛన్‌దారులకు గాను రూ.69 కోట్ల 74 లక్షలు ప్రతినెల కేటాయిస్తున్నారు. ఇప్పుడు ఈ మొత్తాన్ని బుధవారం బ్యాంకుల నుంచి విడుదల చేసి అందించేందుకు చర్యలు ఆరంభించేలా సూచనలు అందాయి. ఇప్పటికే మంచం పట్టిన రోగులు, కదలలేని వృద్ధులకు మాత్రం ఇళ్లకు వెళ్ళి పింఛన్ అందించాలని కీలక నిర్ణయానికి వచ్చారు. మిగతా వారందరికి ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు సచివాలయాల వద్దే పింఛన్ అందుకునే అవకాశాన్ని ఇచ్చారు. ఈ విషయాన్ని సచివాలయ సిబ్బంది అంతా అందరికి సమాచారం అందించాలని సూచించారు. ఎక్కడ సచివాలయ పరిధిలో నివాసం ఉంటున్నారో వారంతా ఆయా సచివాలయాలకు వెళ్ళి పింఛన్ అందుకోవచ్చని మంగళవారం రాత్రి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఇప్పటి వరకు పింఛన్ల పంపిణీ సాఫీగా జరిగింది కాబట్టి వలంటీర్లు లేకుండా పింఛన్ అందుకోవడానికి ఎన్ని ఇబ్బందులు పడ్డామో ప్రజలకు తెలియాలని అధికార పార్టీ ఇప్పటికే ఆశిస్తోంది. వీలైనచోటల్లా ప్రజలకు, వలంటీర్ల వ్యవస్థపై నేరుగా గొప్పలు చెప్పడం, వీరంతా తెలుగుదేశం కారణంగానే మండుటెండల్లో పింఛన్ తీసుకునే పరిస్థితులు వచ్చాయని బురదచల్లేందుకు పన్నాగులు పన్నుతున్నారంటూ టీడీపీ ఆగ్రహంతో ఉంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు టీడీపీ కూడా పింఛన్‌దారులకు సక్రమంగా సొమ్ము చేతికి అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని భావిస్తోంది. వీలైనంత మేరకు తాజా పరిస్థితిని పర్యవేక్షించాలని భావిస్తోంది.

పింఛన్లు ఇంటింటికి ఇవ్వాలి

- కలెక్టర్‌కు టీడీపీ వినతి

భీమవరం అర్బన్, ఏప్రిల్ 2 : సామాజిక పింఛన్లను తక్షణమే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు, ఇతర అధికారులకు వినతి పత్రాలు అందించారు. టీడీపీ, జనసేన, బీజేపీ పెన్షన్లు ఇవ్వద్దని ఆటంకాలు సృష్టించారనే అబద్ధపు ప్రచారాలు వైసీపీ నాయకులు చేస్తున్నారని టీడీపీ కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు ఆరోపించారు.

శివారు గ్రామాల సంగతేమిటి ?

ముదినేపల్లి, ఏప్రిల్ 2 : దివ్యాంగులు, అస్వస్థతకు గురైన వారు, వితంతువులకు ఇంటి వద్ద పెన్షన్లు ఇవ్వడం వరకు ఓకే. మరి సచివాలయాలకు కిలోమీటర్ల దూరంలో వున్న పింఛనర్ల పరిస్థితి ఏమిటి ? ముదినేపల్లి మండలంలోని చాలా గ్రామాల వారు వేసవిలో ఇబ్బందులు తప్పవు. వీరికి కూడా సచివాలయ సిబ్బంది అందజేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. పెదగొన్నూరు సచివాలయానికి మూడు కిలోమీటర్ల దూరంలోని శివారు గ్రామాలైన ఉప్పరగూడెం, కర్షక హరిజనవాడ, విశ్వనాద్రిపాలెం వాసులు వెళ్లి పింఛన్ తీసుకోవాలి. శ్రీహరిపురం సచివాలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని కోమర్రు, చినకోమర్రు, రెండు కిలోమీటర్ల దూరంలోని కాకరవాడ గ్రామాల పెన్షనర్లు వెళ్లి తెచ్చుకోవాలి. సింగరాయపాలెం సచివాలయానికి రెండు కిలోమీటర్ల దూరం నుంచి చేవూరు పెన్షనర్లు, - బొమ్మినంపాడు సచివాలయానికి రామచంద్రపురం, సూర్యనారాయణపురం, పాత హరిజనవాడ, జానకిగూడెం, కొత్త హరిజనవాడ, గొల్లగూడెం పెన్షనర్లు, - ములకలపల్లి పంచాయతీ పెన్షనర్లు రెండు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం రావాల్సి ఉంది. ఇలా మరికొన్ని గ్రామాల పింఛనర్లు ఉన్నారు. తమ ఇళ్లకు సచివాలయాల సిబ్బందిని పంపించి పింఛను అందించాలని పలువురు వృద్ధులు కోరుతున్నారు.

జగన్ స్వార్థ రాజకీయానికి పెన్షనర్లు, వలంటీర్లకు నష్టం : పితాని



పోడూరు, ఏప్రిల్ 2 : జగన్ స్వార్థ రాజకీయానికి పింఛనుదారులు, వలంటీర్లు నష్టపోతున్నారని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పోడూరు మండలం కొమ్ముచిక్కాలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఖజానాలో ఉన్న సొమ్ములన్నీ జగన్ ఇష్టానుసారంగా కాంట్రాక్టర్లకు చెల్లించి, నిధులు కొరత పెట్టి పింఛన్‌దారులకు చెల్లించేందుకు లేకుండా చేశారన్నారు. నిధుల కొరత వల్ల పింఛన్లను ఏప్రిల్ 1న పంపిణీ చేయలేమని ఆలస్యం అవుతుందని అధికారులు ప్రకటిస్తే దీన్ని జగన్, వైసీపీ నాయకులు రాజకీయ రంగు పులిమి ఎన్నికల కమిషన్, చంద్రబాబు వల్లే పింఛన్లు నిలిచిపోయాయంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మల

5న చంద్రబాబు ప్రజాగళం

తరలి రావాలని ఎమ్మెల్యే నిమ్మల పిలుపు

పాలకొల్లు టౌన్/నరసాపురం, ఏప్రిల్ 2 : టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 5, 6 తేదీల్లో నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ముందుగా ప్రకటించిన విధంగా తణుకు పర్యటన రద్దు కాగా ఆ స్థానంలో నరసాపురంలో పర్యటిస్తారు. పాలకొల్లులో 6న ప్రజాగళం బహిరంగ సభను విజయవంతం చేద్దామని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. లయన్స్ కమ్యూనిటీ హాలులో మంగళవారం సాయంత్రం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ముఖ్యనాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాగళం సభను విజయవంతం చేయడంలో కూటమి నాయకులంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రకాలుగా దివాలా తీసిందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం ప్రతీ కార్యకర్త ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ఐదో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు హెలీకాప్టర్‌లో నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో దిగుతారని నరసాపురం టీడీపీ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు చెప్పారు. అక్కడి నుంచి పట్టణంలోని మెయిన్‌రోడ్ వరకు రోడ్ షో నిర్వహించి బహిరంగ సభలో మాట్లాడతారని చెప్పారు. సభ అనంతరం పాలకొల్లు వరకు రోడ్ షో నిర్వహిస్తారని తెలిపారు.



ఎన్నికల నియమావళి అమలుకు బ్యాంకర్లు సహకరించాలి

భీమవరం టౌన్, ఏప్రిల్ 2 : ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలుకు బ్యాంకర్లు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై బ్యాంకుల నుంచి సమాచారాన్ని అందజేయడంపై జిల్లా కలెక్టర్ బ్యాంకర్లతో సమావేశమై చర్చించారు. రెండు నెలల్లో రూ.10 వేలకు మించి డిపాజిట్ లేదా ఉపసంహరణకు సంబంధించి సరైన కారణం లేని లావాదేవీల సమాచారాన్ని అందజేయాలని కోరారు. నియోజకవర్గంలోని అనేక మంది వ్యక్తుల ఖాతాలకు ఒక బ్యాంకు ఖాతా నుండి లక్ష ద్వారా ఎలాంటి పూర్వాపరాలు లేకుండా అసాధారణంగా బదిలీలకు సంబంధించిన వివరాలు అందజేయాలన్నారు జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, లీడ్ బ్యాంకు మేనేజరు ఎ.నాగేంద్ర ప్రసాద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 2 : మే నెల రాక ముందే ఎండలు పెరిగాయి. భానుడు భగభగ మండుతున్నాడు. ఉదయం ఎనిమిది దాటక ముందే సూర్యుడు నిప్పులు కురిపిస్తుండడంతో జనం బయటికి రావడానికి జంకుతున్నారు. వారం క్రితం వరకు సాధారణంగా ఉన్న ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో తట్టుకోలేకపోతున్నారు. ఉక్కపోతతో ఉక్కిబిక్కిరి అవుతున్నారు. నాలుగు రోజుల క్రితం 36 నుంచి 37 డిగ్రీలున్న ఉష్ణోగ్రత 41 డిగ్రీలకు చేరడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.



ఎంపీడీవోకు ఉండి ఎమ్మెల్యే రామరాజు వినతి

పెన్షనర్లకు ఇబ్బంది కలిగించొద్దు

టీడీపీ నేతల డిమాండ్

ఉండి, ఏప్రిల్ 2 : సచివాలయం సిబ్బంది, గ్రామ కార్యదర్శులతోనే పింఛన్లు పంపిణీ చేయించాలని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. మంగళవారం ఎంపీడీవో రవీంద్రకు ఆయన కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందించారు. 'ఎన్నికల కమిషన్ ఆదేశాలనుసారం వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయించరాదు. ప్రభుత్వం వారికిచ్చిన సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు స్వాధీనం చేసుకోవాల'న్నారు.



తాడేపల్లిగూడెం ఆర్డీవోకు వలవల బాబ్జి వినతి

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 2: ఇంటింటికి పింఛన్ పంపిణీ చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్నికల అధికారి, ఆర్డీవో చెన్నయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎల్లప్పుడు ఎదుటి వారిపై బురద చల్లడమే వైసీపీ నైజమంటూ విమర్శించారు.

- **యలమంచిలి :** అవ్వా, తాతలు, దివ్యాంగులకు ఇవ్వాల్సిన పింఛన్ సొమ్ములను జగన్ కాంట్రాక్టర్లకు రూ.13 వేల కోట్లను దోచి పెట్టడంతో ఖజానా ఖాళీ అయ్యిందని.. దీంతో 2న పింఛన్లు అందించలేని దుస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు విమర్శించారు. చించినాడలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేసి మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్ సొమ్మును పంపిణీ చేయవచ్చు. అందుకు భిన్నంగా జగన్ స్వార్థ రాజకీయాలకు తెరలేపాడని విమర్శించారు.
- **తణుకు :** ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని తణుకు టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రమణకు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల వేళ వలంటీర్ల రాజకీయాలకు పాల్పడుతున్నందున బాధ్యతల నుంచి ఎన్నికల సంఘం తప్పించిందని గుర్తు చేశారు. గ్రామ సచివాలయాల సిబ్బందితో ఇంటింటికి పింఛన్లు పంపించే వెసులుబాటు ఉందని చెప్పారు.

మహిళలకు తెలియకుండానే రుణాలు



బ్యాంకులో డ్వాక్రా మహిళలతో ఆరిమిల్లి

దువ్వలో డ్వాక్రా సభ్యుల సొమ్ము కాజేసిన సీఏ

- బ్యాంకు వద్ద ఆరిమిల్లి సహా బాధితుల ధర్నా

తణుకు, ఏప్రిల్ 2 : తణుకు మండలం దువ్వ డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలకు తెలియకుండా వారి పేరు మీద రుణాలు తీసుకొని సొమ్ము కాజేసిన సీఏ భాగ్యలక్ష్మి భాగోతం వెలుగుచూసింది. మంగళవారం పలువురు డ్వాక్రా మహిళలు దువ్వ యూనియన్ బ్యాంకు వద్ద పలు సంఘాల బాధిత మహిళలు ఆందోళనకు దిగారు. క్లస్టర్ ఏజెంట్(సీఏ) భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో 45 డ్వాక్రా సంఘాలున్నాయి. ఒక్కో గ్రూపులో పది మంది మహిళలు ఉన్నారు. ఈ సంఘాల రుణాలు, పొదుపు చెల్లింపులు తానే చూస్తుంది. సభ్యులకు తెలియకుండా వీరి గ్రూపు రుణాలు, సీసీఎల్ రుణాల పేరుతో భారీగా అక్రమాలకు పాల్పడింది. ఒక్కో గ్రూపులోని ఇద్దరేసి సభ్యుల పేర వారికి తెలియకుండానే బ్యాంకులో వ్యక్తిగత రుణాలు తీసుకునేది. ఈ సొమ్ము ఈ సభ్యుల ఖాతాలో పడ గానే.. పొరపాటున వేరే ఖాతాలో పడాల్సిన సొమ్ము మీ అకౌంట్‌లో పడిందని చెప్పి.. ఆ మొత్తాన్ని తన ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయించుకునేది. బాగా తెలిసిన వ్యక్తి కావడం.. అందరికీ తలలో నాలుకలా ఉండడంతో ఆమెను అంతా నమ్మారు. కొంత కాలంగా తన స్వలాభం కోసం రుణాలు పెట్టుకుంటూ అక్రమాలకు పాల్పడింది. కొంత కాలంగా బ్యాంకు ఖాతా పుస్తకాలు ప్రింటింగ్ చేయకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఆయా అకౌంట్‌లలో నగదు విత్ డ్రా చేసింది. పాస్ బుక్‌లో కొంత కాలంగా ప్రింటింగ్ చేయకపోవడంతో సిబ్బందిని మహిళలు ప్రశ్నించారు. దీంతో ప్రింట్ చేయడంతో అకౌంట్‌ల నుంచి భారీ స్థాయిలో నగదు విత్ డ్రాల విషయం బయటపడింది. దీనిపై సీఏ భాగ్యలక్ష్మిని మహిళలు నిలదీయడంతో విషయం గ్రామ పెద్దల వరకు వెళ్లింది. గ్రూపు సభ్యుల నుంచి తానే నగదు తీసుకున్నట్లు ఆమె ఒప్పుకుంది. ఒక్కో ఖాతా నుంచి ఆమె లక్ష నుంచి రెండు లక్షల వరకు విత్ డ్రా చేసినట్లు చెబుతున్నారు. ఈ మొత్తం సుమారు రూ.40 లక్షలు పైమాటేనంటున్నారు.

అన్ని ఖాతాలు తనిఖీ చేయాలి : ఆరిమిల్లి

ఈ విషయం ఎంతకూ తేలకపోవడంతో బాధితులంతా మంగళవారం బ్యాంకును ముట్టడించారు. వీరికి మద్దతుగా తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అక్రమాలు జరిగిన ఈ 45 బ్యాంకు ఖాతాలను తనిఖీ చేయాలి. ఐదేళ్లుగా దువ్వలో ఎంత దోపిడీ జరిగిందో తెలుసుకోవాలి. రుణాలు తీసుకున్న వారే తిరిగి చెల్లించాలి. దీని వెనుక ఎవరు ఉన్నారో గుర్తించాలి. మహిళలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం. రుణాలు, వాయిదాల చెల్లింపుల విషయంలో మినహాయింపు ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. డ్వాక్రా సంఘాల సొమ్ము కాజేసిన ఘటనపై దర్యాప్తు చేయాలని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు అధికారులను కోరారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ప్రతి పైసా తిరిగి మహిళల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు.

ఆర్టీసీ కార్గోలో అవినీతి రవాణా !



నరసాపురం, ఏప్రిల్ 2 : నరసాపురం ఆర్టీసీ కార్గోలో సొమ్ములు గోల్‌మాల్ అయ్యాయి. పార్శిల్ బుకింగ్ సొమ్మును ఎప్పటికప్పుడు సంస్థకు జమ చేయకపోవడంతో ఈ భాగోతం బయటపడింది. పది రోజుల నుంచి ఆర్టీసీ ఆడిట్ అధికారులు రికార్డులను పరిశీలిస్తున్నారు. మరోవైపు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డారు. ఏటా ఆర్టీసీ డిపోల వారిగా ఆడిట్ నిర్వహించడం పరిపాటి. ఈ క్రమంలో కార్గో వాహనాలకు ఆదాయంకంటే ఆయిల్ ఖర్చే ఎక్కువ కనిపించింది. దీంతో అనుమానం వచ్చిన ఆడిట్ సిబ్బంది రికార్డులను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఈ భాగోతం కూడా బయటపడింది. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వారి ఆదేశాలతో ఆర్టీసీ ఆడిట్ అధికారి కాశీం రికార్డులను పరిశీలిస్తున్నారు. ఇందులో పార్శిల్ బుకింగ్ అయిన వెంటనే ఆ సొమ్మును రికార్డుల్లో నమోదు చేయలేదు. రెండు, మూడు రోజులకు ఒకసారి జమ చూపించారు. కొన్ని రోజులు వారం తర్వాత చూపించారు. ఇప్పటి వరకు జరిపిన ఆడిట్‌లో లక్షల్లో తేడా కనిపించింది. ఇలా ఎన్ని ఏళ్లుగా జరిగిందన్న దానిపై రికార్డులను పరిశీలిస్తున్నారు. ఇందులో ఎవరెవరి పాత్ర ఉందన్న దానిపై ఆరా తీస్తున్నారు. దీనిపై డీఎం సుబ్బన్నరెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పార్శిల్స్‌కు సంబంధించిన సొమ్ములు ఏ రోజుకారోజు జమ కాలేదన్న విషయం ఆడిట్‌లో బయటపడిందన్నారు. దీనిపై రికార్డులను పరిశీలిస్తున్నారు. ఎన్ని రోజులకు ఒకసారి జమ చేశారు. నిధులు ఏమైనా పక్కదారి పట్టాయా ? అన్న పూర్తిగా ఆడిట్ జరగాల్సి ఉందన్నారు.

కట్టు తప్పితే వేటే..!

- అధికారులూ తస్మాత్ జాగ్రత్త
- కొరడా ఝుళిపిస్తున్న ఎన్నికల సంఘం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల విధుల్లో గాడి తప్పిన అధికారులు, ఉద్యోగులపై వేటు పడుతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇప్పటికే అధికార పార్టీతో అంటకాగిన పలువురు వలంటీర్లు, ఇతర శాఖల ఉద్యోగులపై వచ్చిన ఫిర్యాదుల మేరకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీల పనితీరుపై వచ్చిన ఫిర్యాదులతో ఎన్నికల సంఘం వారిని బదిలీ చేసింది. ఐఏఎస్‌లకు ఎక్కడా పోస్టింగులు ఇవ్వకుండా సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం ఇంతలా నిఘా పెట్టింది. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ఇప్పటికే కొందరు ఉద్యోగులపై వేటు పడింది. పెంటపాడులో ఎస్ఐని వీఆర్‌లోకి పంపారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారంటూ మెట్ట ప్రాంతంలోని ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. వలంటీర్లను విడిచి పెట్టలేదు. అధికార పార్టీ అభ్యర్థులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని అందిన ఫిర్యాదులపై పెద్ద సంఖ్యలో వలంటీర్లు సస్పెండ్ అయ్యారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాక ముందు ప్రభుత్వం బదిలీలు నిర్వహించింది. జిల్లా నుంచి మండల స్థాయి వరకు తమకు అనుకూల అధికారులను నియమించేలా వ్యవహరించిందంటూ ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయి. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఓ అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థి సామాజిక వర్గానికి చెందిన అధికారులు ఉన్నారు. అక్కడ మండల, రెవెన్యూ, పోలీసు శాఖల్లో ఒకే సామాజిక వర్గం అధికారులు ఉండడంతో అధికార పార్టీ అభ్యర్థి భుజాలెగరేస్తున్నారు. తమ కేడర్ వద్ద ఇదే విషయాన్ని చెబుతున్నారు. వాస్తవ పరిస్థితుల్లో ఎన్నికల సంఘం నిశితంగా పరిశీలిస్తోంది. ఉద్యోగులు, అధికారులు పక్షపాతంతో వుంటే ఫిర్యాదులు చేయాలని రాజకీయ నాయకులతోపాటు, ప్రజలకు సూచించింది. ఫిర్యాదులు వెళితే పరిశీలిస్తున్నారు. అది నిజమైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటున్నారు. అధికార పార్టీకి అభిమానం కురిపిస్తూ కోడ్ ఉల్లంఘిస్తున్న వారిని పక్కన పెడుతున్నారు. ఎన్నికల నియామవళిని తప్పకూడదంటూ ఇప్పటికే ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అయితే కొంత మంది సచివాలయ ఉద్యోగులు ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వంపై కృతజ్ఞత చూపాలంటూ వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. దీనికి ఎన్నికల సంఘం అడ్డుకట్ట వేసింది. వలంటీర్లతో పెన్షన్‌లు, రేషన్ పంపిణీ చేయకూడదంటూ ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. వారి నుంచి సెల్ ఫోన్‌లు, సిమ్‌లు తీసుకోవాలంటూ దిశా నిర్దేశం చేసింది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.

వలంటీర్ల రాజీనామాలు

ఆచంట/పెనుమంట్ర/పెంటపాడు, ఏప్రిల్ 2: ఆచంట, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో వలంటీర్లు రాజీనామాలు చేస్తున్నారు. ఆచంట నియోజకవర్గంలో ప్రలోభాలు, ఒత్తిళ్లతో రాజీనామాలు చేయిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకు పెనుమంట్ర మండలంలో 69 మంది రాజీనామా చేశారు. సోమవారం మార్టేరు నలుగురు, వెలగలేరు ఇద్దరూ రాజీనామాలు చేయగా, మంగళవారం సత్య రామేశ్వరంలో 12 మంది, ఎస్.ఇల్లింద రవర్రులో 11 మంది, పొలమూరులో 27 మంది, జుత్తిగలో 13 మంది రాజీనామాలు చేశారు. పెనుగొండ మండలంలో 69 మంది రాజీనామా చేశారు. పెంటపాడు మండలంలో 27 మంది మంగళవారం మూకుమ్మడి రాజీనామా చేశారు. మండల పరిషత్ సూపరింటెండెంట్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

వలంటీరు తొలగింపు

పెదవేగి, ఏప్రిల్ 2 : పింఛన్ల పంపిణీ ఆలస్యానికి చంద్రబాబే కారణమని, ఈ విషయాన్ని వలంటీర్లంతా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన పెదవేగి గ్రామ వలంటీరు పిల్లా రాజ్యలక్ష్మిని తొలగిస్తూ ఎంపీడీవో వెంకటరమణ ఉత్తర్వులు జారీచేశారు.

443 అభ్యర్థనలకు అనుమతులు జారీ

ఏలూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరుసిటీ, ఏప్రిల్ 2: జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా అందిన అభ్యర్థనలలో ఇంతవరకు 443 అనుమతులు ఇచ్చినట్టు ఏలూరు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా 705 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకు 443 అనుమతులు జారీచేయగా మరో 17 పరిశీలనలో ఉండగా 245 తిరస్కరించామన్నారు. సీ-విజిల్ ద్వారా 214 ఫిర్యాదులు అందగా వాటిలో 121 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 71 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ. 133.68 లక్షలు విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామన్నారు. వీటిలో రూ. 47.54 లక్షలు నగదు కాగా, రూ.81.75 లక్షలు విలువైన మద్యం, రూ. 3.86 లక్షలు ఇతరాలు ఉన్నాయన్నారు.



నాచుగుంట , భువ్వనపల్లిలో తనిఖీలు

రూ.13,27,700 నగదు స్వాధీనం

ఉంగుటూరు /నిడమర్రు /కలిదిండి ఏప్రిల్ 2 : ఉంగుటూరు మండలం నాచుగుంట వద్ద జాతీయ రహదారిపై మంగళవారం తనిఖీల్లో రూ.6.96 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిడమర్రు సీఐ మోగంటి వెంకట సుభాష్ ఆధ్వర్యంలో చేబ్రోలు ఎస్సై మణి కుమార్ ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం తనిఖీలు చేస్తుండగా విశాఖ నుంచి నెల్లూరు జిల్లా సంఘంకు వెళుతున్న కారులో మునగాల కోటేశ్వరరావు తీసుకు వెళుతున్న నగ దుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఉంగుటూరు టోల్‌గేట్ సమీపంలో రూ.లక్షా 27 వేల 700 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిడమర్రు మండలం భువ్వనపల్లిలో ఎఫ్ఎస్‌టీ ఇన్‌చార్జి షేక్ హబీబ్ బాషా నేతృత్వంలో వాహన తనిఖీలు చేస్తుండగా తాడేపల్లిగూడెం నుంచి కాళ్ళ వెళ్తున్న కారు తనిఖీ చేయగా కామిశెట్టి సత్యదుర్గాదాస్ ఎటువంటి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో రూ.75 వేలు నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నిడమర్రు ఎస్ఐ శ్రీను, మనోహర్, దుర్గారావు, జ్యోతి పాల్గొన్నారు. కలిదిండి మండలం మద్వానిగూడెం చెక్ పోస్టు వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేస్తుండగా కలిదిండికి చెందిన గంపా రాజేష్ బుల్లెట్‌పై మంగళవారం రాత్రి రూ.3,59,960, కోరుకొల్లుకు చెందిన దావాకుల వెంకట రాజేష్ కారులో రూ.78,500 నగదును తగిన ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.



జి.కొత్తపల్లిలో సారా స్వాధీనం...వాగిరెడ్డిగూడెంలో బెల్లపు ఊట ధ్వంసం

215 లీటర్ల సారా సీజ్..
4,450 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చింతలపూడి /ద్వారకా తిరుమల : చింతలపూడి ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో ఏఈఎస్ గణపతిబాబు ఆధ్వర్యంలో సారాపై దాడులు జరిపి నలుగురిపై కేసు నమోదు చేసినట్టు చింతలపూడి సీఐ ప్రసాద్ తెలిపారు. సర్కిల్ పరిధిలోని రాగిరెడ్డిగూడెం, లింగపాలెం, వేములపల్లి, కల్లచెరువు గ్రామాల్లో దాడులు జరిపి 3,650 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి 65 లీటర్ల నాటుసారా సీజ్ చేశారు. అనంతరం అల్లిపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు జరిపారు. దాడుల్లో గణపతిబాబుతో పాటు చింతలపూడి సీఐ ప్రసాద్, ఏలూరు డీపీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఎస్సైలు లక్ష్మణరావు, మోహన్‌రావు, నరసింహారావు సిబ్బంది పాల్గొన్నారు. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో మంగళవారం భీమడోలు సీఐ రవి కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి సారా కాస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపు లోకి తీసుకుని వారి నుంచి 150 లీటర్ల సారా, 800 లీటర్ల బెల్లం ఊట స్వాధీనం చేసుకున్నట్లు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఎస్.శ్రీనివాసరావు, ఎంఎస్‌డీ ప్రసాద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

71 లీటర్ల మద్యం స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 2 : సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 71 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ 23,580 రూపాయలు అని ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు స్వాధీనం చేసుకున్న నగదు 10,85,610 రూపాయలు అని తెలిపారు.

మామపై యాసిడ్ దాడి..అల్లుడి అరెస్టు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 2 : మామపై యాసిడ్ పోసి హత్య చేసిన అల్లుడిని జంగారెడ్డిగూడెం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులకు వివరాలు వెల్లడించారు. లక్కవరం గ్రామా నికి చెందిన ప్రగడ నాగేశ్వరరావు (63) పెద్ద కుమార్తె కృష్ణవేణికి, రంగిశెట్టి రమేష్‌కు సుమారు 30 సంవత్సరాల క్రితం వివాహం చేశాడు. మద్యానికి బానిసైన రమేష్ తరచూ కృష్ణవేణితో గొడవపడతుండటంతో సంవత్సరం క్రితం కృష్ణవేణి పుట్టిల్లు లక్కవరం వచ్చేసిందన్నారు. భార్య కృష్ణవేణిని కాపురానికి రమ్మని ఎన్నిసార్లు పిలిచినా ఆమె వెళ్లలేదు. భార్య కాపురానికి రాకపోవడానికి కారణం తన మామ నాగేశ్వరరావు అనే భావించి కోపం పెంచుకున్న రమేష్ మార్చి 31వ తేదీ ఆదివారం రాత్రి యాసిడ్‌తో దాడి చేసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఏప్రిల్ 1న మృతిచెందాడు. ఈ ఘటనపై లక్కవరం ఎస్ఐ టి.సుధీర్ కేసు నమోదు చేశారు. సీఐ రాజేష్ నేతృత్వంలో గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని పుట్లగట్లగూడెం నీలాలమ్మ గుడి సమీపంలో నిందితుడి ఆచూకీ సంబంధించి సమాచారం రావడంతో మంగళవారం సాయంత్రం రమేష్‌ను అరెస్టు చేశారన్నారు. నిందితుడుని బుధవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ రవిచంద్ర తెలిపారు. సీఐ రాజేష్, ఎస్ఐలు సుధీర్, జయబాబులతో పాటు హెచ్‌సీలు రాజేంద్రప్రసాద్, కె.శ్రీనివాసరావు, పీసీలు నరేష్, సత్యనారాయణ, మణికుమార్, ప్రకాష్‌లకు రివార్డులకు సిఫార్సు చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

2-04-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	241	235	239.95
జంగారెడ్డిగూడెం-1	241	235	239.77
జంగారెడ్డిగూడెం-2	241	235	239.51
కొయ్యలగూడెం	241	235	239.95
గోపాలపురం	241	235	238.78

అడుగంటిన గోదావరి



పట్టిసీమ వద్ద తేలిన ఇసుక తిన్నెలు

తగ్గిపోయిన నీటి మట్టం
పంపింగ్ స్కీములకు అందని జలాలు
ఆందోళనలో రైతాంగం



కడమ్మ ఎత్తిపోతల పథకం వద్ద అడుగంటిన గోదావరి

పోలవరం, ఏప్రిల్ 2 : గోదావరిలో జలాలు అడుగంటాయి. ఇసుక తిన్నెలు పైకి తేలాయి. పోలవరం నుంచి పట్టిసీమ వరకూ నీటిమట్టం పూర్తిస్థాయిలో తగ్గి కడమ్మ ఎత్తిపోతల పథకం, పట్టిసీమ ఎత్తిపోతల పథకం, సత్యసాయి మంచి నీటి పథకం, గూటాల పంపింగ్ స్కీంలకు తగినంత నీరందక పంపింగ్ స్కీం నిర్వహణ నిలిచే పరిస్థితులు నెలకొన్నాయి. పోలవరం పంచాయతీ పరిధిలో యడ్లగూడెం వద్ద ఉన్న కడమ్మ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ఆయకట్టులో సుమారు ఆరు వందల ఎకరాలకు పైగా నీరందేది. నీటిమట్టం తగినంత లేకపోవడం వల్ల పంట చివరి తడులకు సాగునీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆయకట్టు పరిధిలో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మరో నెల రోజులు తడులు అందితే పంటలు గట్టెక్కుతాయని లేకపోతే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టుకున్న రైతులు నష్టపోయే పరిస్థితులు ఎదురవుతాయని అధికారులు స్పందించి నీటి తడులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీటి కరువుకి ప్రధాన కారణాలివే..

ప్రతీ ఏటా పోలవరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల సక్రమంగా జరిగేది. ఈ ఏడాది వర్షాలు ఆశించినంత లేకపోవడం వల్ల పోలవరం ప్రాజెక్టు స్పిల్వే వద్ద ఎగువన 25 మీటర్లకు నీటిమట్టం పడిపోయింది. స్పిల్వే దిగువన 13 మీటర్లకు మాత్రమే ఉండడం, స్పిల్వే గేట్లు అన్నీ పూర్తిస్థాయిలో మూసివేసి స్పిల్వే దిగువన ఉన్న 10 స్లూయిజ్‌లలో కేవలం 3 స్లూయిజ్‌ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తుండడం వల్ల పోలవరం , పట్టిసీమ, ప్రాంతాల్లో నదీ నీటిమట్టం 11.50 మీటర్లకు పడిపోయింది. దీని వల్ల కడమ్మ ఎత్తిపోతల పథకం పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకం వద్ద నీటిమట్టం తగ్గి పంపింగ్ స్కీంలు పనిచేయడానికి అవకాశాలు లేకుండా పోయాయి. గూటాల పంపింగ్ స్కీం వద్ద నీటిమట్టం ఆశించిన స్థాయిలో ఉండడం వలన ఆ పంపింగ్ స్కీం పరిధిలో 2400 ఎకరాలకు నీటి ఎద్దడి లేదు. ప్రస్తుతం నీటి ఎద్దడితో బాధపడుతున్న రైతుల సాగునీటి కష్టాలు పోవాలంటే సీలేరు నుంచి జలాల విడుదల చేయాలని , ధవళేశ్వరం బ్యారేజీ వద్ద తూర్పు పశ్చిమ డెల్టాలకు నీటి పంపిణీ క్రమబద్ధీకరిస్తే సరిపోతుందని రైతులు చెబుతున్నారు.

నీటి నిల్వలు తక్కువుగా ఉన్నాయి
గోదావరి హెడ్ వర్క్స్ డీఈ రమేష్

ఈ ఏడాది వర్షాలు లేకపోవడం వల్ల నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయి. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 12.27 మీటర్లు మాత్రమే నమోదైంది. గత ఏడాది ఇదే సీజనులో 13 మీటర్లకు పైబడి ఉండడం వల్ల నీటి ఎద్దడి లేదు. గత ఏడాది ఉభయ గోదావరి డెల్టాలకు 6,300 క్యూసెక్కుల సాగు జలాలు అందించాం. ఈ ఏడాది 5,900 క్యూసెక్కుల సాగు జలాలు మాత్రమే అందించగలిగాం. రెండవ పంటకు మాత్రం 9 లక్షల ఎకరాలకు సాగునీటి ఎద్దడి లేకుండా చేయగలిగామని సీలేరు జలాలు విడుదల చేస్తే నీటిమట్టం పెరిగి సాగునీటి ఎద్దడి ఉండదని తెలిపారు.

హస్తవాసి



కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితా విడుదల
సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాకు చింతలపూడి
పాత కొత్తతరం కలబోసి అవకాశాలు
వైసీపీ నుంచి చేరిన వారికి ప్రత్యేక ఛాన్స్
దెందులూరు స్థానంపై కాంగ్రెస్‌లో అసంతృప్తి
టిక్కెట్ నిరాకరించడంతో ఆశావహులు
చౌదరి పార్టీకి రాజీనామా
షర్మిల దిష్టిబొమ్మ దహనం చేసిన అనుచరులు
ఇంకా తేలని ఎంపీ సీట్లు

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వచ్చే ఎన్నికల్లో పోటీచేసే అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను మంగళవారం కాంగ్రెస్ ప్రకటించింది. దీర్ఘకాలికంగా కాంగ్రెస్‌ను అంటిపెట్టుకుని ఉన్నవారికి, వైసీపీని వీడి ఈ మధ్యనే కాంగ్రెస్‌లో చేరిన వారికి అసెంబ్లీ టిక్కెట్లు లభించాయి. పీసీసీ చీఫ్ షర్మిల ఈ మేరకు జాబితాను ప్రకటించారు. దీర్ఘకాలంగా పార్టీని నమ్ముకుని ఉన్నవారికి అవకాశమిచ్చారు. అలాగే కొత్త జిల్లాలకు నాయకత్వ బాధ్యతలు చేపట్టిన వారికి కూడా ఛాన్స్ ఇచ్చారు.



దెందులూరులో వైఎస్ షర్మిల దిష్టి బొమ్మ దహనం చేస్తున్న చౌదరి అనుచరులు

పాత, కొత్త ముఖాలతో జాబితా

కాంగ్రెస్‌కు జవజీవాలు ఇవ్వాలనే సంకల్పంతో పార్టీ తరపున వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయడంలో పీసీసీ జాగ్రత్తలు పాటించింది. పాత, కొత్త తరాల మధ్య సమన్వయంతో పాటు కాస్తంత లోపాలు లేకుండానే జాబితాను విడుదల చేసినట్టు కొంత మంది భావిస్తున్నా అదే సమయంలో ఈ మధ్యనే వైసీపీకి రాజీనామా చేసి పార్టీలో చేరిన వారికి కూడా అసెంబ్లీ అభ్యర్థి జాబితాలో వారికి చోటు ఇవ్వడం పట్ల కొంత ఆశ్చర్యం వ్యక్తమైంది. ఏలూరు లోక్‌సభ స్థానంలో ఆరు అసెంబ్లీ స్థానాలకు నరసాపురం లోక్‌సభ స్థానంలో ఆరు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఏలూరు, ఆచంట అసెంబ్లీ స్థానాల నుంచి అభ్యర్థులను ఎవరినీ ప్రకటించలేదు. కమ్యూనిస్టులతో ఎన్నికల పొత్తు కారణంగా ఈ రెండు స్థానాలను పెండింగ్‌లో పెట్టినట్టు భావిస్తున్నారు.

చింతలపూడి నియోజకవర్గం నుంచి రెండోసారి పోటీచేసేందుకు కాస్త ఉత్సాహం చూపిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాను వైసీపీ పక్కన పెట్టింది. ఆయనకు ఛాన్స్‌లేదని మూడువారాల క్రితమే తేల్చి చెప్పింది. దీంతో వైసీపీ పట్ల తీవ్ర అసంతృప్తి ఆగ్రహంతో ఉన్న అయనను పార్టీలో చేర్చు కునేందుకు టీడీపీ ఒకవైపు, మరోవైపు కాంగ్రెస్ పోటీపడ్డాయి. ఇదే తరుణంలో అయన ఈ మధ్యనే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఎదుట కాంగ్రెస్‌లో చేరారు. పట్టుమని వారం తిరగకముందే ఎమ్మెల్యే ఎలీజాకు చింతలపూడి అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి దిగగా కాంగ్రెస్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో చింతలపూడి నియోజకవర్గంలోని ఓట్ల చీలిక అత్యధికంగానే ఉంటుందని భావిస్తున్నారు. విభజిత పశ్చిమగోదావరి జిల్లాకు కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మర్నీడి శేఖర్(బాబ్జి)కి తాడేపల్లిగూడెం నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించారు. పార్టీకి దీర్ఘకాలికంగా విధేయుడిగా, నమ్మకస్తుడిగా ఉన్న పాతపాటి హరికుమార్‌రాజుకు ఉంగుటూరు నియోజకవర్గం సీటు దక్కింది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ హరికుమార్‌రాజు ఇదేస్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పట్లో ఆయనకు మిగతా నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థుల కంటే రికార్డు స్థాయిలో ఓట్లు దక్కడం హరికుమార్ రాజుకు ప్రాముఖ్యత దక్కింది. దెందులూరు నుంచి ఆలపాటి నరసింహమూర్తి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డీవీఆర్‌కే చౌదరి మధ్య పోటీ జరిగినా చివరకు నరసింహమూర్తి అభ్యర్థిత్వం పట్లే కాంగ్రెస్ మొగ్గు చూపింది. పెదవేగి మండలం ముండూరుకు చెందిన నరసింహమూర్తికి అవకాశం ఇచ్చి తనను పక్కన పెట్టడంపై చౌదరి తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. కాంగ్రెస్‌కు రాజీ నామా చేస్తున్నట్టు ప్రకటించారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల దిష్టిబొమ్మను ఆయన అనుచరులు దహనం చేశారు. పార్టీని నమ్ముకుని ఉన్నందుకు జరిగిన న్యాయం ఇదేనా అంటూ జాబితాపై చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం నుంచి దువ్వెల సృజనకు కాంగ్రెస్ టిక్కెట్ ఇచ్చింది. ఇంతకు ముందే సృజన టీడీపీ, వైసీపీలో కూడా కొనసాగారు. నూజివీడు నియోజకవర్గంలో చాలాకాలం నుంచి కాంగ్రెస్‌నే వెన్నంటి ఉంటున్న కృష్ణమరీదుకు అసెంబ్లీకి పోటీ చేసే ఛాన్స్ దక్కింది. ఈ నియోజకవర్గంలో కృష్ణ పలువురికి సుపరిచితుడు కూడా. కైకలూరు నుంచి బొడ్డు నోబుల్‌ని కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించారు. ఈ మధ్యనే జరిగిన కాంగ్రెస్ సర్వసభ్య సమావేశంలో నోబుల్ వైసీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుత పరిస్థితిని పరిగణలోకి తీసుకుని మూడు రోజులు వ్యవధిలోనే నోబుల్‌కి కాంగ్రెస్ టిక్కెట్ దక్కడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. పార్టీలో సీనియర్లుగా ఉన్న అనేకమందికి కూడా ఈసారి అసెంబ్లీకి పోటీ చేసేందుకు వీలుగా పలువురు అభ్యర్థిత్వాన్ని పీసీసీ ఖరారు ప్రకటించింది. ఈ జాబితాలో పాలకొల్లు నుంచి కొలుకులూరి అర్జున్‌రావు భీమవరం నుంచి అంకెం సీతారామ్, తణుకు నుంచి కడలి రామా రావును అభ్యర్థిత్వాలను ప్రకటించారు. వీరంతా కాంగ్రెస్‌లో దీర్ఘకాలి కంగా నాయకత్వం వహిస్తున్నారు. పార్టీ వ్యవహారాలను చక్కపెడుతూ వచ్చారు. నరసాపురం నుంచి కానూరి ఉదయభాస్కర్ కృష్ణప్రసాద్‌ను కూడా జాబి తాలో చేర్చారు. మొత్తంమీద కాంగ్రెస్ విడుదల చేసిన తొలి జాబితాలో పాత, కొత్త తరాల కలయికతో పాటు ఈ మధ్యనే పార్టీలో చేరిన టిక్కెట్లు దక్కటం కాంగ్రెస్ మార్పుకు నిదర్శనంగా మిగిలింది.

ఆచంట, ఏలూరు సంగతి ఏంటి ?

ఏలూరు, ఆచంట అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ పెండింగ్‌లో పెట్టింది. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోని పోలవరం నియోజకవర్గాన్ని తమకే కేటాయించాల్సిందిగా సీపీఐ ఇప్పటికే కాంగ్రెస్‌ను కోరింది. వామపక్షాలతో కాంగ్రెస్ ఎన్నికల పొత్తుకు దిగింది. ఈ అవగాహనలో భాగంగానే సీపీఐ పోలవరం కోరుకున్నా ఆ స్థానం నుంచి సృజనను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించారు. ఆ స్థానానికి బదులుగా ఏలూరు అసెంబ్లీ స్థానాన్ని వామపక్షాలకు కేటాయించినట్లు భావిస్తున్నారు.ఈ స్థానం నుంచి పార్టీ సీనియర్ నాయకుడు బండి వెంకటేశ్వరరావును రంగంలోకి దింపాలని ఇప్పటికే సీపీఐ ఏకాభిప్రాయానికి వచ్చింది. సోమవారం ఈ మేరకు జిల్లా కార్యవర్గ సమావేశంపై తీర్మానం కూడా చేసింది. ఏలూరులో స్థిరపరిచితుడైన బండి వెంకటేశ్వరరావు రంగంలోకి దిగితే మెరుగైన ఓట్లశాతం దక్కగలదని సీపీఐ భావిస్తోంది. ఇదిలా ఉండగా ఆచంట అసెంబ్లీ స్థానాన్ని పెండింగ్‌లో పెట్టారు. ఈ స్థానం నుంచి ఇంతకు ముందు పలుమార్లు సీపీఎం పోటీ చేసిన దాఖలాలు ఉన్నాయి. ఈసారి సీపీఎంకు ఆ స్థానాన్ని కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంకోవైపు నరసాపురం, ఏలూరు లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరినీ ఇంకా ఖరారు చేయలేదు. ఈ రెండు స్థానాలను పెండింగ్‌లోనే ఉంచారు.

ప్రకటించిన అభ్యర్థులు



హరికుమార్‌రాజు నరసింహమూర్తి ఉన్నమట్ల ఎలీజా కృష్ణ మరీదు

- ఉంగుటూరు : పాతపాటి హరికుమార్‌రాజు
- దెందులూరు : ఆలపాటి నరసింహమూర్తి
- పోలవరం : దువ్వెల సృజన
- చింతలపూడి : ఉన్నమట్ల ఎలీజా
- నూజివీడు : కృష్ణమరీదు
- కైకలూరు : బొడ్డు నోబుల్
- పాలకొల్లు : కొలకలూరి అర్జున్‌రావు
- నరసాపురం : కానూరి కృష్ణప్రసాద్ (బుజ్జి)
- భీమవరం : అంకెం సీతారామ్
- ఉండి : వెంకట గోపాలకృష్ణంరాజు
- తణుకు : కడలి రామారావు
- తాడేపల్లిగూడెం : మర్నెడి శేఖర్



బొడ్డు నోబుల్



అర్జున్‌రావు



సీతారాం, గోపాలకృష్ణం రాజు, రామారావు, శేఖర్



కానూరి కృష్ణప్రసాద్ (బుజ్జి)

5 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

గణపవరం, ఏప్రిల్ 2: గణపవరం మండల గ్రామాల్లో ఈనెల 5 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం గణపవరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన రబీ ధాన్యం కొనుగోలుపై అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్నారు. మండలంలో 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. రైతులంతా ఈ కేంద్రాలను ఉపయోగించుకుని మద్దతు ధర పొందాలన్నారు. బుధవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గోనెసంచులు అందుబాటులో ఉంటాయన్నారు. మండల వ్యవసాయాధికారి వైవీఎస్ ప్రసాద్, తహసీల్దార్ వై.రాంబాబు, ఎంఎల్‌వో దాసు, వీఆర్వోలు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం..చెట్టు పడి విరిగిన విద్యుత్ స్తంభం



పెనుమంట్ర, ఏప్రిల్ 2 : పెనుమంట్ర మండలం పాల మూరు వ్యవసాయ పరపతి సంఘం భవనం సమీపంలో చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో దగ్గరలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఆ సమయంలో అటువైపు వచ్చేవారు గమనించడంతో తృటిలో ప్రమాదం తప్పింది. లేకపోతే పాఠశాలకు వెళ్లి వచ్చే ప్రధాన మార్గం ఇదే కావడంతో పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. స్తంభం పడిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. విద్యుత్ అధికారులు వెంటనే అక్కడకు చేరి వైర్లు తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

త్వరలో కైకలూరులో పవన్ బహిరంగ సభ

కైకలూరు, ఏప్రిల్ 2: ఎన్నికల ప్రచారంలో భాగంగా కైకలూరులో జనసేన అధినేత పవన్ కల్యాణ్ బహిరంగ సభ ఉంటుందని కైకలూరు బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ మంగళ వారం రాత్రి తెలిపారు. పిఠాపురం నియోజకవర్గం లో పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కైకలూరు నియోజక వర్గ ఎన్నికల పరిస్థితులపై సుదీర్ఘ చర్చలు జరిపినట్లు కామినేని తెలిపారు. త్వరలో ఎన్నికల బహిరంగసభ నిర్వహిస్తామని అందుకు పవన్‌కల్యాణ్ సుముఖత చూపారని, త్వరలోనే తేదీని ప్రకటించనున్నట్లు తెలిపారు.

కోడిపందేలపై దాడి ..ఐదుగురి అరెస్టు

ఆకివీడు, ఏప్రిల్ 2: అయి-భీమవరంలో కోడి పందాలు నిర్వహిస్తున్న వారిపై మంగళవారం పోలీసులు దాడిచేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.4,500 , 2 కోడి పుంజులు, 2 కోడి కత్తులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

అమ్మో ! బంగారం..

పసిడి ధర పరుగులు
ఆల్‌టైం రికార్డులు దాటుతూ..
పది గ్రాముల బిస్కెట్ ధర 71,000


నరసాపురం, ఏప్రిల్ 2: పసిడి ధర పరుగులు పెడుతోంది. నెల రోజుల నుంచి ఎక్కడా ఆగడం లేదు. ఆల్‌టైం రికార్డులను చెరిపేస్తూ దూసుకు పోతోంది. మంగళవారం గ్రాము బిస్కెట్ బంగారం రూ.7,100 పలికింది. కాసు (ఎనిమిది గ్రాములు) ధర అయితే రూ.56,800 చేరింది. ఆర్నమెంట్ బంగారం గ్రాము రూ.6,570 ఉంది. కాసు అయితే రూ.52,560

ధర పెరుగుదలకు అనేక కారణాలు

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థల పతనం, అమెరికా ఫెడరల్ బ్యాంకు వడ్డీ రేట్లను మరోసారి తగ్గిస్తుందన్న వాదనలు, ఇటు అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరల ప్రభావం కూడా పసిడిపై పడింది. మరోవైపు మనదేశంలో ఎన్నికల నేపథ్యంలో కొనుగోళ్లు భారీగా పడిపోయాయి. వీటి న్నంటికి తోడు స్టాక్ మార్కెట్‌లో కూడా తీవ్ర ఒడిదుడుకులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో మదుపుదారులు పసిడిపై పెట్టుబడులు పెట్టేం దుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ కారణంగానే ధరలు పెరుగు తున్నాయని బులియన్ వర్గాలు పేర్కొంటున్నాయి. ధర ఇలాగే పెరుగుతూ ఉంటూ ఈ ఏడాది చివరికి గ్రాము రూ.8 వేలు చేరినా ఆశ్చర్యపోనవసరం లేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

దుకాణాలు వెలవెల

రాష్ట్రంలో పసిడి మార్కెట్‌కు పశ్చిమ పెట్టింది పేరు. జిల్లాలోని నరసా పురం, భీమవరం, తణుకు, టీపీగూడెం ప్రాంతాల్లో ఎక్కువ జ్యూయలరీ షాపులు ఉన్నాయి. వీటిలో నరసాపురం మార్కెట్‌లోనూ రోజుకు రూ.5 కోట్లు పైనే వ్యాపారం జరుగుతుంది. సీజన్ అయితే రెట్టింపు ఉంటుంది. ఇక్కడ 150కుపైగా దుకాణాలు ఉన్నాయి. తరువాత స్థానం భీమవరానిదే. కార్పొరేట్ బులియన్ షోరూలన్నీ ఇక్కడే ఉన్నాయి. నెల రోజుల నుంచి ధర పెరుగుతూ ఉండటం వల్ల ఆ ప్రభావం మార్కెట్‌పై పడింది. ఈకారణంగా పసిడి దుకాణాలు వెలవెల బోతున్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ అయినప్పటికీ కొనేందుకు ఎవరూ సాహసించడం లేదు.



అంతర్జాతీయ పరిణామాలే కారణం



పసిడి ధర పెరుగుదలకు అంతర్జాతీయ పరిణామాలే కారణం. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ కుంటుపడింది. ఫెడరల్ బ్యాంకు వడ్డీ రేట్లు తగ్గించవచ్చన్న అనుమానాలతో చాలామంది మదుపుదారులు బంగారంపై పెట్టుబడులు పెడుతున్నారు.ఇవికాకుండా ఇటీవల రష్యాలో జరిగిన కాల్పుల సంఘటన కూడా ఒక కారణం.

- అజిత్‌కుమార్ జైన్, జిల్లా బులియన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

మూడేళ్లలో రెట్టింపు అయింది



కోవిడ్ తరువాత పసిడి ధర ఎక్కడా దిగి రావడం లేదు. 2019లో గ్రాము రూ.3,500 ఉండేది. నేడు రెట్టింపు అయింది. కేవలం నాలుగేళ్లల్లో ఈ స్థాయిలో పెరుగుతుందని ఎవరూ ఊహించలేదు. ఎప్పటికప్పుడు తగ్గితే కొందామని ఎదురుచూశాం. అంచనాల తలక్రిందులు చేస్తూ బంగారం పెరిగిపోతుంది. ప్రస్తుతం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు పసిడి ధర అందనంత ఎత్తుకు వెళ్లిపోయింది

- సుధా అన్నపూర్ణ, గృహిణి, నరసాపురం

క్షీరా రామలింగేశ్వర స్వామి కల్యాణానికి అక్షింతలు



స్వామివారి కళ్యాణానికి వినియోగించే అక్షింతలను చేతితో వలుస్తున్న మహిళలు

పాలకొల్లు అర్బన్, ఏప్రియల్ 2 : క్షీరా రామలింగేశ్వర స్వామి కల్యాణం ఈనెల 19వ తేదీన జరగనున్న నేపథ్యంలో ఆలయంలో స్వామివారి కల్యాణానికి వినియోగించే అక్షింతలను మహిళలు వడ్ల నుంచి చేతులతో వలచి సిద్ధం చేస్తున్నారు. భద్రాచలంలోని శ్రీరాముల వారి కల్యాణానికి ఈవిధంగా చేతితో వలచిన బియ్యపు గింజలను అక్షింతలుగా వినియోగిస్తారు. ఈకార్యక్రమంలో సనాతన దాండియా గ్రూపు లీడర్ నండూరి భాగ్యలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు. సుమారు 50 కిలోల ధాన్యాన్ని చేతితో వలిచి అక్షింతలుగా రూపొందిస్తున్నారు. పాలక మండలి ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో సూర్యనారాయణ, ట్రస్టీలు, సిబ్బంది ఈకార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

శ్రీ ముఖదారమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పాలకొల్లు అర్బన్, ఏప్రియల్ 2 : అచ్చుగట్లపాలెంలో శ్రీ ముఖదారమ్మ జాతర ఈనెల 9వ తేదీ నుంచి 15 వరకు నిర్వహిస్తారు. ఈసందర్భంగా ఆలయం వద్ద మంగళవారం జాతర పోస్టర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు

ఆకివీడు, ఏప్రిల్ 2: రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రైస్ మిల్లర్సు ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రైస్ మిల్లర్స్, వీఆర్వో, ఎంపీఈవోలు, సహకార సిబ్బందితో ధాన్యం కొనుగోలుపై సమావేశం జరిగింది. ప్రభుత్వం ఏర్పాటుచేసిన చినకాపవరం, మాదివాడ, ఆకివీడు-2, అయి-భీమవరం, చెరుకుమిల్లి, సిద్ధాపురం, చినమిల్లిపాడు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఆకివీడు రైస్ అండ్ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పేరూరి రాధాకృష్ణ, ఏవో ప్రియాంక, డీటీ ఫరూఖ్, రైస్ మిల్లర్స్ నేరెళ్ల రామచెంచయ్య, మోటుపల్లి సుబ్బారావు, నేరెళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

పేద ముస్లింలకు దుస్తుల పంపిణీ



నరసాపురం టౌన్, ఏప్రిల్ 2: పేద ముస్లింలకు అంజుమన్ సంస్థ అండగా ఉంటుందని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ బుల్లిమస్తాన్, దావూద్‌ఖాన్ అన్నారు. మంగళవారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పంజా సెంటర్‌లోని అంజుమన్ భవనంలో 500 మంది ముస్లిం కుటుంబాలకు బట్టలు పంపిణీ చేశారు.

ఉచిత మధుమేహ వైద్యపరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2: తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ పరీక్షలను జనతా హాస్పటల్‌లో మంగళవారం నిర్వహించారు. వైద్య పరీక్షలను తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ జోన్ ఛైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణరాజు ప్రారంభించారు. మారిశెట్టి సత్యనారాయణ సహకారంతో 108 మందికి పరీక్షలు చేశారు. క్లబ్ కార్యదర్శి చిన్నం జగదీష్, సభ్యులు ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, దాట్ల లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు.

ఇస్రో శిక్షణకు దండగర్ర విద్యార్థిని



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2: ఇస్రో ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులతో నిర్వహించే యువశాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమానికి దండగర్ర జడ్పీ హైస్కూల్ విద్యార్థిని మరపట్ల రత్నకుమారి ఎంపికైనట్టు హెచ్ఎం సీహెచ్. చంద్రశేఖర్ తెలిపారు. దేశ వ్యాప్తంగా లక్షా 50 వేల మంది దరఖాస్తు చేయగా 350 మందిని ఇస్రో ఎంపిక చేసినట్టు వివరించారు. శిక్షణ మే 12 నుంచి 25 వరకు శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ వద్ద ఉంటుందన్నారు.

మాతా,శిశు మరణాలు లేకుండా చూడాలి

ఆకివీడు రూరల్: పెదకాపవరం పీహెచ్‌సీలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ, వైద్య ఆరోగ్యశాఖాధికారులు సంయుక్త సమన్వయ సమావేశం నిర్వహించారు. గర్భవతి అని తెలియగానే రెండు శాఖలు నమోదు చేసుకోవాలని, రక్తహీనతతో ఉన్న గర్భిణులకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి గర్భిణిని అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు దత్తత తీసుకోవాలని అన్నారు. జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారిణి బి సుజాతరాణి, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో బాలునాయక్, సీడీపీవో వాణీ విజయరత్నం, వైద్యులు రత్న కుమారి పాల్గొన్నారు.

పాలకోడేరు: గ్రామాలలో మాతా, శిశు మరణాలు లేకుండా వైద్యశాఖ, శిశు సంక్షేమశాఖ సమన్వయంతో పనిచేయాలని ఆకివీడు ప్రాజెక్టు సీడీపీవో వాణి విజయరత్నం అన్నారు. పాలకోడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళల అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, వైద్యఆరోగ్యశాఖ సమన్వయ కమిటీ సమావేశం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రంగనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. గర్భవతికి రక్తహీనత లేకుండా తగిన పౌష్టికాహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భవతి అయినప్పటి నుంచి పురుడు పోసుకునే వరకు వారిని కంటికి రెప్పలా చూడాలన్నారు.

సర్దార్ పాపన్న గౌడ్‌కు నివాళులు



పాలకోడేరు, ఏప్రిల్ 2 : భారతదేశంలో మొట్టమొదటి బహుజన చక్రవర్తి గోల్కొండ కోటను నవాబులు ఏలిన కాలంలో ఆయన బహుజన సైన్యంతో బడుగు బలహీన వర్గాలను చేరదీసి ఒక సైన్యంగా తయారు చేసి ఏలిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పలువురు కొనియాడారు. పాలకోడేరు గ్రామం గౌడ్ సెంటర్‌లో పురాణ దిమ్మ వద్ద మంగళవారం తొలి బహుజన వీరుడు పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంఘ గౌరవ అధ్యక్షుడు అంగర సుబ్బారావు, అధ్యక్షులు యర్రింకి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కారింకి సాయి బాబు, కార్యదర్శి చిటికెన పుల్లయ్య, బెజవాడ సుబ్బారావు, పాపన్న గౌడ్ విగ్రహ దాత మాన్యం తేజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం

ఆకివీడు, ఏప్రిల్ 2: కేంద్ర పథకాలను వైసీపీ సొంత పథకాలుగా ప్రచారం చేసుకొని రాష్ట్ర ప్రజలను సీఎం జగన్ మోసం చేశాడని ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు ఇంజేటి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఎరువులు-పురుగు మందుల భవనంలో పట్టణ అధ్యక్షుడు శింగలూరి చిట్టిబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమన్నారు. ఏళ్ళతరబడి పెండింగ్‌లో ఉన్న రామమందిరాన్ని ప్రారంభించారన్నారు. నర్సాపురం పార్లమెంట్ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగమణి, నానాజీ, రమణయ్య, మాణిక్యాలరావు, పట్టణ ఉపాధ్యక్షులు చొప్పర్ల బలరాం పాల్గొన్నారు.

వలంటీర్ల సెల్‌ఫోన్లు, సిమ్‌ల స్వాధీనం

ఆకివీడు, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వలంటీర్లు విధులకు దూరంగా ఉంటారని ఎంపీడీవో వై.రామకృష్ణ అన్నారు. మండలంలోని 12 సచివాలయాలకు సంబంధించిన 175 సెల్‌ఫోన్లు సిమ్‌లు మంగళవారం స్వాధీనం చేసికొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వలంటీర్లు అందచేయకూడదని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలున్నాయన్నారు. అనంతరం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పింఛన్ల పంపిణీ విషయంలో ఎటువంటి అలసత్వం వహించవద్దన్నారు.

ఆర్టిస్ట్ మధు మృతి



పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 2 : ప్రముఖ ఆర్టిస్ట్‌గా పేరొందిన తమ్నా మావుళ్ళింగేశ్వరరావు (48) (మధు) మంగళవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. ఆర్టిస్ట్‌గా మంచి మంచి చిత్రాలను రూపొందించడంలో పాటుగా కమర్షియల్ ఆర్టిస్ట్‌గా మధు ఆర్ట్స్ పేరుతో సంస్థను నిర్వహిస్తున్నారు. మధుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మధు మృతికి ఆర్టిస్ట్స్ అండ్ పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, అంతర్జాతీయ ఆర్టిస్ట్ ఎం ఉదయ్‌కుమార్, మధు గురువు పొన్నా సాయి కృష్ణ, సీనియర్లు జీఎస్ఎన్, కడలి శ్రీనివాస్, సిరివల్లి ఆర్ట్స్ శ్రీనివాస్ తదితరులు సంతాపం తెలిపారు.









ఆచంటలో టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణకు టైలర్స్ సంఘ నాయకుల మద్దతు.. చించినాడలో ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర ఎన్నికల ప్రచారం.. తణుకులో రిక్షా తొక్కుతూ ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రచారం.. పెంటపాడులో ఐక్యత చాటుతున్న జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, వలవల బాబ్జి తదితరులు

వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి: ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 2: వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి కుంటుపడిందని తణుకు టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం నాల్గో వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్ళి గతంలో తాము చేసిన అభివృద్ధి, అధికారంలోకి వచ్చాక చేపట్టే అభివృద్ధిని వివరించారు. ప్రతిచోటా పెద్ద సంఖ్యలో స్థానికులు వచ్చి హారతులు పడుతున్నారు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద ఫ్లాట్ రిక్షా తొక్కుతూ ఆరిమిల్లి ప్రచారం చేశారు. పట్టణంలో ఎక్కడా అభివృద్ధి జాడలేదని, మురుగునీరు, చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, కలగర వెంకట కృష్ణ, పరిమి వెంకన్నబాబు, ఆనాల ఆదినారాయణ, పితాని మోహన్, తోట సూర్యనారాయణ, అల్లి సత్యనారాయణ, నల్ల బాస్కరరావు పాల్గొన్నారు.

ఆరిమిల్లికి పలు సంఘాల మద్దతు

వైసీపీలో రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం ఆరిమిల్లి రాధాకృష్ణకు మద్దతుగా పలు సంఘాలు ఆత్మీయ సమావేశం నిర్వహించాయి. తణుకు కార్ ఓనర్స్ అండ్ మోటార్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆటో యూనియన్ నాయకులను కూటమికి మద్దతుగా నిలవాలని కోరారు.

ఆరిమిల్లి సతీమణికి మహిళల బ్రహ్మరథం

తణుకు, ఏప్రిల్ 2: టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణను గెలిపించాలంటూ ఆయన సతీమణి కృష్ణతులసి చేపట్టిన ఇంటింటి ప్రచారానికి మహిళలు బ్రహ్మరథం పడుతున్నారు. మంగళవారం సజ్జాపురంలోని హరిశ్చంద్ర టవర్స్ నుంచి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు గండి రామకృష్ణ, కొప్పాల ఇందిరాదేవి, తమరాపు రమణమ్మ, కాకిలేటి సత్యవాణి, రేవతి, కొమ్మిరెడ్డి ప్రభాకర్ రావు, భీమనాథుని వెంకట సుబ్బారావు, తెలగరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

చించినాడలో ఎమ్మెల్యే నిమ్మల ప్రచారం

యలమంచిలి, ఏప్రిల్ 2: చించినాడ గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మల మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో లబ్ధిదారుల ఇంటివద్దనే సకాలంలో పింఛన్ సొమ్మును పంపిణీ చేయవచ్చని.. అందుకు భిన్నంగా జగన్ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దిగజారుడు రాజకీయాలకు తెరలేపాడని విమర్శించారు.

కూటమి అభ్యర్థుల విస్తృత ప్రచారం

పింఛన్లకు ప్రభుత్వం వద్ద డబ్బు లేని దుస్థితి

ఆకివీడు, ఏప్రిల్ 2:శవ రాజకీయాలకు అలవాటుపడిన అధికారపార్టీ ప్రతీ విషయాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలనుకుంటున్నదని టీడీపీ ఎమ్మెల్యే మంతెన రామరాజు సతీమణి సుష్మ అన్నారు. వెలంపేట రామాలయంలో ముందుగా ప్రత్యేక పూజలు చేసి 11, 13, 15 వార్డులలో ఆమె ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఖజానాలో నగదు లేకపోవడంతో ప్రభుత్వం పింఛన్లు ఇవ్వలేకపోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ మండల-పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు మోటుపల్లి రామవరప్రసాద్, బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, రాష్ట్ర నాయకులు భూపతిరాజు తిమ్మరాజు, దాట్ల రామరాజు, మండలాధ్యక్షురాలు బచ్చు సరళ కుమారి, జిల్లా అధికార ప్రతినిధి బొర్రా సుజాత, కౌన్సిలర్లు బొల్లా వీరశ్వేత, కిమిడి అరుణకుమారి, బత్తుల శ్యామల, గుర్రాని నాగలక్ష్మి, అల్లు యామిని,కొల్లి వెంకన్నబాబు, రంగిశెట్టి ప్రకాశ్, ఓసూరి సత్యనారాయణ,అల్లు సాంబ,మధు , వేగేశ్న రామరాజు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: లబ్ధిదారులకు ఇళ్ళ వద్దనే పింఛన్ సొమ్ము చెల్లించాలని టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కమిషనర్ వెంకటేశ్వర్రావు, ఎంపీడీవో రమణరావులను కలిసి సచివాలయ సిబ్బంది చేత పంపిణీ చేయాలన్నారు.

యలమంచిలి: వృద్ధులు, దివ్యాంగులు, పెన్షన్ లబ్ధిదారులకు వారి ఇంటివద్దే పింఛను అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని మండలంలోని టీడీపీ, జనసేన నాయకులు యలమంచిలి ఎంపీడీవో పి.శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపి, ఆరుమిల్లి చిన్ని, బోనం నాని, బొప్పన చిన్న పాల్గొన్నారు.

ఆకివీడు: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇళ్ళ వద్దకు వెళ్ళి అర్హులకు పింఛన్లు అందచేయాలని నగర పంచాయతీ టీడీపీ, జనసేన కౌన్సిలర్లు బొల్లా వీరశ్వేత, కిమిడి అరుణకుమారి, బత్తుల శ్యామల, గుర్రాన నాగలక్ష్మి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వై.రామకృష్ణ వినతి పత్రం అందజేశారు. అనంతరం కమిషనర్‌కు కూడా వినతి పత్రం అందించారు.

పాలకొల్లు టౌన్: పింఛన్‌దారులకు ఇళ్ల వద్దనే సొమ్ములు అందచేయాలని టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పార్థసారధికి సకాలంలో ఇళ్ల వద్ద పింఛన్లను పంపిణీ చేయాలని కోరుతూ రోజారమణితో పాటు టీడీపీ నాయకులు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, పాలకొల్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: పింఛన్ల పంపిణీని రాజకీయ పార్టీలకు అతీతంగా అధికారులు పంపిణీ చేపట్టాలని ఎన్నికల అధికారుల్ని, ఎంపీడీవోలను టీడీపీ, జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో సూర్యనారాయణకు వినతిపత్రాలు అందజేశారు. సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేసే తరుణంలో అధికార పార్టీ కార్యకర్తల జోక్యం ఉండరాదని కోరారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, కూసంపూడి సురేంద్రకుమార్ రాజు, కాపారం చిన్న, తోట శ్రీనివాసరావు, వంగా రఘు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్/ పెంటపాడు: నియోజకవర్గంలో పింఛన్లు ఇంటింటికి వెళ్ళి పంపిణీ చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. మంగళవారం పట్టణంలో ఎన్నికల అధికారి, ఆర్డీవో చెన్నయ్యకు, ఎంపీడీవోలకు వినతి పత్రాలను అందజేశారు. పెంటపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వినతి అందజేశారు.

పితానికి టైలర్స్ సంఘ నాయకుల మద్దతు

ఆచంట, ఏప్రిల్ 2: ఆచంట నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పితాని సత్యనారాయణకు టైలర్స్ సంఘం నేతలు మద్దతు తెలిపారు. రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ ఆకాశం స్వామి ఆధ్వర్యంలో మంగళవారం పితాని ఇంటి వద్దకు వెళ్ళి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఆచంటకు చెందిన టైలర్స్ కొలుకులూరి సత్యనారాయణ, బాలం నాగేశ్వరరావు, కూర్మారావు, ఎం. నాగేశ్వరరావు, బొక్కా బాలాజీ, వేండ్ర శ్రీను, యుగంధర్, అలిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

జగన్ పాలనలో అంతా దగా: నాయకర్

నరసాపురం రూరల్, ఏప్రిల్ 2: జగన్ పాలన అంతా దగానేనని జనసేన కూటమి అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. మంగళవారం చామకూరిపాలెంలో టీడీపీ,బీజేపీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ళల్లో ప్రభుత్వం ఇచ్చింది పది అయితే.... దోచుకున్నది రూ 100పైనే అన్నారు. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ ఉండదన్నారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, జనసేన నాయకులు దాగంటి మురళీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుని ఆలోచించి ఓటు వేయాలన్నారు.



నరసాపురంలో జనసేన కూటమి అభ్యర్థి నాయకర్‌తో కలిసి టీడీపీ శ్రేణుల ప్రచారం

టీడీపీ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 4 : రానున్న ఎన్నికల్లో కూటమి తరపున టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూర్చే పథకాలను అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి అన్నారు. మంగళవారం వెంకటాపురం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న నిమ్మల రామానాయుడును గెలిపించాలని కోరారు.

జనసేనకు నాయీ బ్రాహ్మణుల మద్దతు

గణపవరం, ఏప్రిల్ 2: రాష్ట్రంలో జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంలో నాయీ బ్రహ్మణులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేందుకు కృషి చేస్తామని జనసేన పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. మంగళవారం గణపవరం కన్యాకాపరమేశ్వరి వర్తకసంఘ భవనంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో నాయీ బ్రాహ్మణులు జనసేనకు మద్దతు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : బొలిశెట్టి

పెంటపాడు, ఏప్రిల్ 2: పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పెంటపాడులో పల్లెపోరు కార్యక్రమాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీతో కలసి నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దత్తు ప్రసాద్, బండి పెద్దిరాజు, పాతూరి రాంప్రసాద్‌చౌదరి , పోతుల అన్నవరం, వాడపల్లి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: నియోజకవర్గంలో అరాచక పాలనను అంతమొందించాలంటే ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణంలో ఆయా పార్టీల ఇన్‌చార్జిలు, నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించి బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ సమష్టిగా పనిచేసి గెలుపు సాధిద్దామన్నారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండి కూటమి విజయానికి కృషి చేయాలన్నారు.

ఓటుపై బుర్రకథ కళాకారుల అవగాహన

ఆచంట, ఏప్రిల్ 2: ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని అటువంటి ఓటును ప్రతీ ఒక్కరూ ఎన్నికల్లో సద్వినియోగించుకోవాలని బుర్రకథ కళాకారులు తమ ప్రచారంలో వివరించారు. మంగళవారం స్థానిక రామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం వద్ద బుర్రకథ కళాకారులు ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అర్హత కలిగిన వారు వెంటనే ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల రోజున తమ ఓటును సద్వినియోగించుకుని మంచి పాలకులను ఎన్నుకోవాలని అన్నారు.

సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

ఆచంట, ఏప్రిల్ 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికలైన వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచామని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. స్వామినాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్నికల కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆర్వో మాట్లాడుతూ ఎన్నికలు సందర్భంగా సోషల్‌మీడియాలో ఎటువంటి ఫొటోలు గాని, వీడియోలు గాని పోస్టు చేయడం గాని, ఫార్వర్డ్ చేయడం గాని చేయకూడదన్నారు. వీటిపై నిరంతరం నిఘా ఉంటుందని వివాదాస్పద పోస్టులు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడినా, ఎవరైనా ప్రలోభాలుపెట్టినా కంట్రోల్‌రూమ్ నెంబరు 08814-297299కు సమాచారం అందించాలన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



పెనుగొండలో వాహన తనిఖీలు

పెనుగొండ, ఏప్రిల్ 2: పెనుగొండ - సిద్ధాంతం రోడ్డులో ప్రధాన రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ మంగళవారం వాహనాలను తనిఖీలు నిర్వహించారు. అత్యవసరంగా ఎక్కువ నగదు తీసుకెళ్ళాల్సి వస్తే దానికి తగిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. లేని పక్షంలో ఎన్నికల నియమావళి అనుసరించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ప్రత్యేక అధికారులు ఎం. సత్యనారాయణ, ఎస్‌వీ ఆచార్యులు, ఏఎస్ఐలు కెపోలయ్య, ఆర్ఐ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు: మొగల్తూరు జాతీయ రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. మంగళవారం మొగల్తూరు జాతీయ రహదారిపై కృష్ణా జిల్లా నుంచి వచ్చే, వెళ్ళే వాహనాలును ఏఎస్ఐ యు.రాజేంద్ర, స్క్వాడ్ టీమ్ ఇన్‌చార్జ్ మౌనిక ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు.

గ్రామాల్లో శివ సుడిగాలి పర్యటన



చిలుకూరులో పర్యటిస్తున్న స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు

ఉండి, ఏప్రిల్ 2: నియోజకవర్గ ప్రజలకు మరొకమారు సేవ చేయడానికి తనను గెలిపించాలని ఉండి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. మంగళవారం చిలుకూరు, వెలివర్రు, పాములపర్రు, కోలమూరులో సుడిగాలి పర్యటన చేశారు. గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా తనను మంచి మెజార్టీతో గెలిపించడంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశానంటూ ఆయన గుర్తుచేశారు. కోలమూరులో పల్లెనిద్రలో ప్రజలతో మమేకమయ్యారు. పల్లెనిద్రలో గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, మాజీ జడ్పీటీసీ గేదెల జాన్, గాదిరాజు శ్రీనివాసరాజు, నాయకులు మోపిదేవి నాగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు వీరా స్వామి మృతి



పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 2 : టీడీపీ నేత ఆరిమిల్లి రాజేశ్వర రావు తండ్రి శతాధిక వృద్ధుడు ఆరిమిల్లి వీరాస్వామి (101) ఆయన స్వగ్రామం గొల్లవానిచెరువు గ్రామంలో మంగళవారం ఉదయం మృతి చెందారు. వీరాస్వామి మృతికి ఎమ్మెల్యే నిమ్మల రామా నాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, ముత్యాల శ్రీనివాస్, న్యాయవాది ఎం.వెంకటరామిరెడ్డి, గోపాల్ రాజు, కాకతీయ సంక్షేమ సంఘం నాయకులు మేడికొండ శ్రీనివాస్ చౌదరి, చిలుకూరి ద్రాక్షారామ భీమన్న, మండాది అవినాష్, గ్రామ వైస్‌ప్రెసిడెంట్ రామకృష్ణ సంతాపం తెలిపారు.

రేపటి నుంచి భాగవత సప్తాహం

భీమవరం టౌన్, ఏప్రిల్ 2: చిన్మయ ప్రభ ఆధ్వర్యంలో శ్రీమద్ భాగవత సప్తాహజ్ఞాన యజ్ఞ మహోత్సవం ఈనెల4వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమవుతుందని చిన్మయ ప్రభ అధ్యక్షుడు బొండా వెంకట సుబ్బారావు తెలిపారు. భారతదేశంలోని పలు పుణ్యక్షేత్రాల్లో 145 భాగవత సప్తాహాలు నిర్వహించిన హైదరాబాద్‌కు చెందిన తంగిరాల రాజేంద్రప్రసాద్ శర్మచే చిన్మయప్రభలో భాగవత సప్తాహం నిర్వహిస్తున్నామని తెలిపారు.

జేపీ యూత్ సేవా కార్యక్రమాలు

భీమవరంటౌన్, ఏప్రిల్ 2 : జేపీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వీరవాసరం జడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని జేపీ యూత్ ఆధ్వర్యంలో తొలుత పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర బధిర పాఠశాలలో కేక్ కటింగ్, చిన్నారులకు బిస్కెట్స్ చినఅమిరంలోని శ్రీస్వామి యోగేశ్వరానందగిరి విశ్వశాంత వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం, పెన్నాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా సామగ్రి పంపిణీ అందించారు. చినఅమిరం ఇమ్మానియేలు చిల్డ్రన్స్ హాస్టల్లో అన్నదానం, రైల్వే జంక్షన్ దగ్గర అన్న దానం, గునుపూడి ఇందిరమ్మ కాలనీలో వంద మందికి చీరల పంపిణీ చేశారు.

అమ్మవారికి ఎమ్మెల్యే సతీమణి సుష్మ పూజలు

ఆకివీడు రూరల్ ఏప్రిల్ 2: కోళ్ళపర్రులోని కమ్మవారి పాలెంలోని పుంతల మునలమ్మ అమ్మవారిని, పోతురాజు బాబులను ఎమ్మెల్యే రామరాజు భార్య సుష్మ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి 8వ వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. జనసేన ఉండినియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, దారపురెడ్డికన్నబాబు, గవరలక్ష్మి, సాయి, గవర అనిల్, కేశిరెడ్డి వెంకటేశ్వరరావు, గొడవర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

మొగల్తూరు, ఏప్రిల్ 2: తీర గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అన్నిరకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉప పంచాయతీ అధికారి జె.సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం ఆయన ఎంపీడీవో బాబ్జీరాజు, ఈవోఆర్డీ నవీన్ కిరణ్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ మోహనరావు, పంచాయతీ కార్యదర్శి సీతారామారావు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముత్యాలపల్లి గ్రామంలో పర్యటించి తాగునీటి సరఫరాలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రామస్థుల నుంచి అడిగితెలుసుకున్నారు. కోమటితిప్పలో మంచినీటి ప్రాజెక్టు చెరువును వారు పరిశీలించారు.

పింఛన్ల పంపిణీపై అవగాహన

కాళ్ళ, ఏప్రిల్ 2 : మండల పరిధిలో ఆయా గ్రామాల్లో పింఛన్ల పంపిణీ విషయమై సచివాలయ సిబ్బందికి కాళ్ళ ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రధానంగా పింఛన్లు పంపిణీలో సమయ పాలన పాటించాలని ఉద్యోగులకు, గ్రామ కార్యదర్శులకు ఇన్‌చార్జీ ఎంపీడీవో ఎంవి భాస్కరరావు సూచించారు. పంపిణీలో వలంటీర్లను అనుమతించరాదని అన్నారు.

ఇరగవరం: పింఛను పంపిణీ సమయంలో లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ఎంపీడీవో కె.పద్మజ్యోతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలకనుగుణంగా బుధవారం పింఛను సొమ్ము సచివాలయ ఖాతాకు జమవుతాయని వాటిని వెంటనే విత్ డ్రా చేసుకుని బుధవారం మధ్యాహ్నం నుంచి పంపిణీ ప్రారంభించాలని తెలిపారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలి

అత్తిలి, ఏప్రిల్ 2 : గర్భిణుల పేర్లు నమోదు చేసుకుని వారిని గృహ సందర్శన ద్వారా హెల్త్ చెకప్ చేయించాలని తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ప్రమోద్ కుమారి అన్నారు. అత్తిలి, మంచిలి పీహెచ్‌సీల్లో వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సంయుక్త సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాతృ మరణాలు నివారించాలన్నారు. అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం. శ్రీదేవి, కె. కుమారి, టి. మహాలక్ష్మి పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్య నిపుణులు

పెంటపాడు, ఏప్రిల్ 2: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 4న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జన్, ఊపిరితిత్తులు, చర్మవ్యాధులు, చెవి, ముక్కు, గొంతు సంబంధ వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి అన్ని రక్తపరీక్షలు, ఈసీజీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు.

బీజేపీ పోలింగ్ బూత్ ఏజెంట్ల నియామకం

పోడూరు, ఏప్రిల్ 2: మండలంలోని 52 పోలింగ్ బూత్‌లకు బీజేపీ ఏజెంట్లను మంగళవారం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి యర్రంశెట్టి పద్మారావు, మండల బీజేపీ అధ్యక్షుడు నాగరాజు బదరీనారాయణరాజు నియామకం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ యర్రంశెట్టి పద్మారావు మాట్లాడుతూ పోలింగ్ బూత్ ఏజెంట్లు ఎన్నికల నియమావళిని పాటించి విధులు సక్రమంగా నిర్వహించి పార్టీకి మంచిపేరు తీసుకురావాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

దివ్యాంగులకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం



దివ్యాంగుల వైద్యపరీక్షలు పరిశీలిస్తున్న కో-ఆర్డినేటర్ శ్యాంసుందర్

భీమవరం టౌన్, ఏప్రిల్ 2 : భీమవరం డివిజన్ స్థాయిలో అర్బన్ భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రం ఆవరణలో ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ మంగళవారంనాడు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలు పాఠశాలలకు వెళ్ళడానికి అవసరమైన ఉపకరణాలు అందజేయడానికి వైద్య బృందం కొలతలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సహిత విద్య కోఆర్డినేటర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం, సహాయ కోఆర్డినేటర్, టి.శ్రీనివాస్ మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పవన్, బొలిశెట్టిలను విమర్శించే అర్హత మంత్రికి లేదు

పెంటపాడు, ఏప్రిల్ 2: జనసేన అధినేత పవన్‌కల్యాణ్, నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను విమర్శించే అర్హత మంత్రి కొట్టు సత్యనారాయణకు లేదని దర్శిపర్రు జనసేన సర్పంచ్ కోలా శేషవేణి, ఉప సర్పంచ్ కోలా మార్కండేయులు విమర్శించారు. దర్శిపర్రులో ఆత్మీయ సమావేశంలో మంత్రి కొట్టు చేసిన విమర్శలపై మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్, బొలిశెట్టి నిజాయితీపరులని మీలా కాసుల కోసం కక్కుర్తి పడటం లేదని విమర్శించారు. టీడీపీ, జనసేన నాయకులు రుద్ర కాశి, పాలూరి వెంకన్న, కోడే కాశి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ఇష్టపడి పనిచేస్తే సత్ఫలితాలు : యండమూరి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 2: ఏ పనైనా ఇష్టపడి చేస్తే సత్ఫలితాలు సాధించగలమని నవలా రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో 'స్పెక్ట్రా 2కే 24' పేరిట నిర్వహించిన సాంకేతిక ఉత్సవాన్ని ఆయన ప్రారంభించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమయాన్ని వృథా చేయకుండా చక్కగా చదువుకుని లక్ష్యాలు సాధించాలన్నారు. పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, ఉపాధ్యక్షుడు కోట వెంకట రామకృష్ణారావు, కోశాధికారి బాలకాశియ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల్లోపే రహదారి నిర్మాణం

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 2: అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే పట్టణంలోని గణేష్ నగర్ నుంచి కొండ్రుప్రోలు వరకు రహదారిని నిర్మిస్తామని కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. మంగళవారం వాకర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో బొలిశెట్టి మాట్లాడుతూ బ్రాహ్మణులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.